క్లుప్తంగా

భూసార పరీక్షలు తప్పకుండా చేయాలి



మట్టి నమూనా సేకరణ నిర్వహిస్తున్న దృశ్యం

పరిగి: ప్రతి పొలంలోనూ మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షలు చేయాలని మండల వ్యవసాయాధికారి విజయభారతి వ్యవసాయ శాఖ సిబ్బందికి సూచించారు. భూసార పరీక్షలపై స్థానిక ఆర్‌బీకేలో గురువారం ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడారు. భూసార పరీక్షల ఆవశ్యకతను రైతులకు వివరించారు. అనంతరం ఓ రైతు పొలంలో భూసార పరీక్షలు నిర్వహించారు. ఏఈఓ లలిత పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

సోమందేపల్లి: తహసీల్దార్ మురళీకృష్ణను పుట్టపర్తి కలెక్టరేట్‌కు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పరిగి తహసీల్దార్ సౌజన్య లక్ష్మిని నియమించారు. సర్వేయర్ కరుణాకర్ కూడా బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు.

చలివేంద్రం ఏర్పాటు

సోమందేపల్లి: సోమందేపల్లిలోని మార్కెట్ రోడ్డులో సత్యసాయి సేవా సమితి, గుడిపల్లి శ్రీనివాస్ గురువారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, సర్పంచ్ కిష్టప్ప తదితరులు పాల్గొన్నారు.

వేలం ఖరారు



వేలం నిర్వహిస్తున్న ఈఓఆర్డీ కృష్ణప్ప

రొళ్ల: మండల కేంద్రం సచివాలయం–1 ఆవరణలో గురువారం సర్పంచ్ రామలక్ష్మమ్మ, ఈఓఆర్డీ కృష్ణప్ప ఆధ్వర్యంలో బస్టాండ్, వారపు సంత మార్కెట్‌కు ఏడాది పాటు సుంకం వసూళ్లకు గురువారం వేలం నిర్వహించారు. శేఖర్ అనే వ్యక్తి రూ.80 వేలకు దక్కించుకున్నారు. కార్యదర్శి శ్రీనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేశ్‌రంగారెడ్డి, ప్రసన్నకుమార్, రవికుమార్ పాల్గొన్నారు.

రేపు బహిరంగ వేలం

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని డైలీ, వీక్లీ మార్కెట్, బస్టాండ్ పార్కింగ్ స్థలాలు, చింత ఫలసాయం, చేపల చెరువులను శనివారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయనున్నట్లు కమిషనర్ ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నామినేషన్ దాఖలు




నామినేషన్ పత్రం అందజేస్తున్న కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ అభ్యర్థి గోవిందప్ప

పావగడ: పావగడ అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి నామినేషన్ల ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. కర్ణాటక రాష్ట్ర సమితి పార్టీ(కేఆర్‌ఎస్‌పీ) నుంచి అభ్యర్థి వీ.గోవిందప్ప నామినేషన్ పత్రం దాఖలు చేశారు. నామినేషన్ పత్రాన్ని ఆర్వో అతిక్ పాషాకు అందజేశారు. ఆర్వో మాట్లాడుతూ ఉదయం 11 నుంచి సాయంత్రం 3 గంటలలోపు నామినేషన్ పత్రాలు దాఖలు చేయాలన్నారు.

ఇసుక రీచ్ రద్దు చేయాలి

పరిగి: మండల కేంద్రంలోని జయమంగళీ నదిలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు గురువారం ఆందోళన చేపట్టారు. రోడ్డుపై అడ్డంగా పడుకొని నిరసన వ్యక్తం చేశారు. పెనుకొండ సీఐ కరుణాకర్ ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. సమస్య ఉంటే కోర్టులో పరిష్కారం చేసుకోవాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. అయినప్పటికీ ససేమిరా అనడంతో ఆందోళనకారులను పోలీసులు అరెస్టు చేశారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్ఫూర్తితో ఆదర్శంగా ఎదగండి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి

పెనుకొండ: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో గురువారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అంబేడ్కర్ నిరుపేద కుటుంబంలో జన్మించి ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారన్నారు. విద్యార్థులు అంబేడ్కర్ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్లాలన్నారు.

మంచి చేస్తున్న జగనన్నకే మా దీవెనలు

- గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో స్పష్టం చేసిన లబ్ధిదారులు
- అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు: ఎమ్మెల్యే తిప్పేస్వామి





సంకంపాళ్యంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి, గుంతపల్లిలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

మడకశిర రూరల్: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయిన తర్వాతనే తమ జీవితాలు బాగుపడ్డాయని, సంక్షేమ పథకాలతో తమను ఆదుకున్న జగనన్నకే మరోసారి మా దీవెనలు ఉంటాయని లబ్ధిదారులు, మహిళలు స్పష్టం చేశారు. మడకశిర మండలంగోవిందాపురం గ్రామ సచివాలయ పరిధిలోని గుద్దిలపల్లి, సంకంపాళ్యం గ్రామాల్లో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ తిప్పేస్వామి హాజరై ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలతో ఆయా కుటుంబాలు జరిగిన లబ్ధిని వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ జగనన్న పాలనలో తమకు ఎంతో మేలు జరిగిందన్నారు. జగనన్నను ఎప్పటికీ మరువలేమన్నారు. అనంతరం ఎమ్మెల్యే అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు ఇంటివద్దకే అందుతాయన్నారు. ప్రజలకు పథకాలు దక్కకుండా చంద్రబాబునాయుడు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి సీఎంగా చేసుకోవాలని ప్రజలకు సూచించారు. రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, వైస్ ఎంపీపీ మూర్తి, జెడ్పీటీసీ సరోజమ్మ, ఎంపీటీసీ తాళికేరమ్మ, మాజీ సర్పంచ్ విశ్వనాథ్, మండల సచివాలయ కన్వీనర్ నాగేంద్రయాదవ్, సూపర్ వైజర్ అరుణ, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి మంజునాథ్ పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా వైఎస్ జగనే ఉండాలి



సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న పథకాలు సక్రమంగా ఇంటి వద్దకే అందుతున్నాయి. ఈబీసీ నేస్తం, వైఎస్సార్ ఆసరా, పంటల బీమా, వైఎస్సార్ పింఛన్ కానుక, సున్నా వడ్డీ(రైతు), రైతు భరోసా పథకాల ద్వారా రూ.1,60,947 మేర లబ్ధి పొందాం. మళ్లీ సీఎం జగనే సీఎంగా ఉండాలి

తిమ్మక్క, గుద్దిలపల్లి గ్రామం, మడకశిర మండలం

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారయణ

గోరంట్ల: పేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని పెనుకొండ ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ పేర్కొన్నారు. గోరంట్ల మండలం పుట్టగుండ్లపల్లి పంచాయతీ గుంతపల్లి గ్రామంలో సర్పంచ్ నార్శిరెడ్డి నేతృత్వంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం, 'నువ్వే మా నమ్మకం జగన్' కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే హాజరై ప్రతి ఇంటివద్దకు వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 2014 ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఆరు వందలకుపైగా ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న వైఎస్ జగన్ పాదయాత్ర ద్వారా ప్రజా సమస్యలు తెలుసుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే హామీలన్నీ అమలు చేశారన్నారు. పేదల సంక్షేమానికి అనేక పథకాలు అమలు చేశారన్నారు. పేదల అభ్యున్నతికి తపిస్తున్న జగనన్నను మరోమారు ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, ఎంపీపీ ప్రమీల, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, జిల్లా సహకార బ్యాంక్ డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ ఫక్రుద్దీన్‌సాహెబ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు డాక్టర్ బాషా, ఎంపీటీసీ ఓబుళరెడ్డి, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ రఘునాథ గుప్తా, నాయకులు అశోక్‌కుమార్‌రెడ్డి, ఈడిగ ఆనంద్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నేడు ఇఫ్తార్ విందు

రొద్దం: మండల కేంద్రంలోని జామియా మసీదు వద్ద శుక్రవారం ముస్లింలకు ఎమ్మెల్యే శంకరనారాయణ ఇఫ్తార్ విందు ఇవ్వనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బోయ తిమ్మయ్య, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బి.నారాయణరెడ్డి, సచివాయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి గురువారం తెలిపారు. అదేవిధంగా సాయంత్రం మండల కేంద్రంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొంటారన్నారు.

గ్రామాల్లో నీటి ఎద్దడి నివారించండి

గుడిబండ: గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఈఓఆర్డీ నాగరాజునాయక్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజు రోజుకూ ఎండలు పెరుగుతున్నందున గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వీధిలైట్లు వెలిగేలా చూడాలన్నారు, మురుగు కాలువలను రోజూ శుభ్రం చేయించాలని, ఇంటి పన్నులు వసూలు చేయాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల్లో కూలీల సంఖ్య పెంచండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి పనులను వేగవంతం చేసి కూలీల సంఖ్య పెంచాలని ఎమ్మెల్యే తిప్పేస్వామి అధికారులను ఆదేశించారు. ఉపాధి పనులపై నియోజకవర్గ స్థాయిలో గురువారం పట్టణంలోని సీఎల్‌ఆర్‌సీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి పనులను చేపట్టడంలో లక్ష్యం సాధించాలని ఆదేశించారు. కూలీలు ఉపాధి పనులపైనే ఆధార పడి జీవిస్తున్నారని, అడిగిన వెంటనే పనులు కల్పించి వలసలను పూర్తిగా నివారించాలని ఆయన ఆదేశించారు. పనుల్లో అక్రమాలు,అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి గ్రామంలో కూడా ఉపాధి పనులు చేపట్టాలన్నారు. సమీక్షలో ఏపీడీ జయసింహ,ఎంపీడీఓలు మునిస్వామి, సోనిబాయి, రామారావు,కోర్స్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, ఏపీఓలు, టీఏలు,ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల తనిఖీ

లేపాక్షి: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. గురువారం సైన్స్ పరీక్ష జరిగింది. లేపాక్షిలోని ఓరియంటల్ ఉన్నత పాఠశాల, ఏపీ గురుకుల పాఠశాల, వివేకానంద జెడ్పీ ఉన్నత పాఠశాలలోని కేంద్రాలను గురువారం తహసీల్దార్ బాబు, ఎంపీడీఓ నరసింహనాయుడు పరిశీలించారు. తాగునీరు, విద్యుత్ సదుపాయాలపై ఆరా తీశారు. మూడు కేంద్రాల్లో 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఎంఈఓ నాగరాజు తెలిపారు.

సోమందేపల్లి: సోమందేపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, క్రీస్తు జ్యోతి, విజ్ఞాన్ పాఠశాలలను తహసీల్దార్ మురళీ కృష్ణ గురువారం తనిఖీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది నాగరాజు నాయక్, ఎస్‌ఐ కరీమ్, ఎంఈఓ ఆంజినేయులు నాయక్ పాల్గొన్నారు.

మడకశిర: నియోజకవర్గంలోని 17 కేంద్రాల్లో 3,333 మంది గాను 3,286 మంది హాజరయ్యారు. 47 మంది గైర్హాజరైనట్లుఅధికారులు తెలిపారు.

పరిగి: పరిగి, సేవామందిరం జెడ్పీహెచ్ ఉన్నత పాఠశాలలను తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి పరిశీలించారు. నాలుగు కేంద్రాలలో ఏడు మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

అమరాపురం: అమరాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ. మోడల్ పాఠశాలలోని పరీక్షా కేంద్రాలను ఎంపీడీఓ మునిస్వామి తనిఖీ చేశారు.

పోస్టల్ శాఖ పథకాలు వినియోగించుకోండి



పోస్టల్ సన్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ అందిస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

హిందూపురం: పోస్టల్ శాఖ అందించే పొదుపు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ సూచించారు. హెడ్‌పోస్టాఫీసులో గురువారం జరిగిన పోస్టల్ సన్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు పొదుపు చేసుకునేందుకు ఇది చక్కటి అవకాశమన్నారు. పోస్టల్ సూపరింటెండెంట్ బాల సత్యనారాయణ మాట్లాడుతూ పోస్టల్ సన్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ స్కీంలో రూ.వెయ్యి నుంచి గరిష్టంగా రూ.2 లక్షల వరకు రెండేళ్ల కాలపరిమితితో డిపాజిట్ చేస్తే 7.5శాతం వడ్డీ లభిస్తుందన్నారు. మార్చి 2025 వరకు ఈ పథకం ఉంటుందన్నారు. హెడ్‌పోస్టుమాస్టర్ మార్కెండేయులు పాల్గొన్నారు.

'జగనన్నే మా భవిష్యత్'కు అపూర్వ స్పందన



హిందూపురం: పోచనపల్లిలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్‌ను అతికిస్తున్న దృశ్యం, చిత్రంలో ఎమ్మెల్సీ మహమ్మద్‌ఇక్బాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ తదితరులు

హిందూపురం: జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమానికి ప్రజలనుంచి అపూర్వ స్పందన లభిస్తోంది. మళ్లీ మళ్లీ జగనన్నే సీఎం కావాలని ప్రజలు ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఎదుట తమ ఆకాంక్ష వ్యక్తం చేశారు. గురువారం హిందూపురం మున్సిపాల్టీలో 3,4,6,10,12, 13,14, 17,21,30,31,32,38 తదితర వార్డుల్లో కౌన్సిలర్లు, వార్డు కన్వీనర్ల ఆధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గృహసారథులు, కన్వీనర్లతో కలిసి ఎమ్మెల్సీ ఇంటింటికీ వెళ్లి వారిని అప్యాయంగా పలకరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. టీడీపీ పాలన, వైఎస్సార్‌సీపీ పాలన మధ్య వ్యత్యాసాన్ని గుర్తించాలని ప్రజలకు సూచించారు. మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను ఇళ్లకు అతికించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌కు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్, సర్పంచ్ ఆనంద్, నాయకులు ఆనంద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు చిన్నమ్మ, రహమత్‌బీ, మారుతీరెడ్డి, బలరామిరెడ్డి, సునిత, ఫర్వీన్‌బాను, నాగమణి పాల్గొన్నారు.

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డుల్లో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమాన్ని నిర్వహించగా విశేష స్పందన లభించింది. మున్సిపాలిటీ జేసీఎస్ కన్వీనర్ విక్రమ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమపథకాలను వివరిస్తూ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇళ్లకు అంటించారు.

మడకశిర(అగళి): మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమం జరిగింది. ప్రజల కోరిక మేరకు ప్రతి ఇంటికీ వెళ్లి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్‌ను అతికించారు. మండల జేసీఎస్ కన్వీనర్ శివన్న, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

రొద్దం: మండలంలోని వివిధ గ్రామాల్లో 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహించారు. సచివాయాల సమన్వయకర్త ఆర్‌ఏ రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రభుత్వం చేపడుతున్న పథకాలను వివరించారు.

మడకశిరరూరల్: మండలంలోని 18 గ్రామ సచివాలయాల పరిధిలో జగనన్నే మా భవిష్యత్, 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం జోరుగా సాగుతుంది. గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. వారి అనుమతితో స్టిక్కర్లు అతికించి ఐదు ప్రశ్నలు అడిగి వివరాలను సేకరించారు. జగనన్నకే సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రజలు స్పష్టం చేశారు.

అమరాపురం: మండలంలోని పలు గ్రామాల్లో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు గురువారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. జగనన్న ఫొటో ఉన్న స్టిక్కర్లను ఇళ్ల గోడలకు అతికించారు.

పరిగి: మండలంలోని బీచిగానిపల్లి, వంగలపల్లి, ఊటుకూరు, శ్రీరంగరాజుపల్లి, కొడిగెనహళ్లి, పెద్దిరెడ్డిపల్లి, మోదా, శాసనకోట, పరిగి, బసవనపల్లి తదితర గ్రామాల్లో గురువారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం కొనసాగింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటీకి వెళ్లి సంక్షేమ పథకాలు వివరించారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



రొద్దంలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న నాయకులు



మడకశిర రూరల్: రేకులకుంటలో కరపత్రాన్ని అందిస్తున్న దృశ్యం



అమరాపురంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

సంక్షిప్త సమాచారం

ర్యాలీని జయప్రదం చేయండి

హిందూపురం టౌన్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి మహోత్సవాన్ని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వివిధ ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. సూగూరు ఆంజనేయస్వామి ఆలయం నుంచి ఉదయం 8గంటలకు బైక్ ర్యాలీ, చిన్న మార్కెట్ నుంచి ఉదయం 8.30గంటలలకు అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టనున్నామన్నారు. అన్ని వర్గాల ప్రజలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలు

మడకశిర రూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది సమీపంలో ప్రధాన రోడ్డులో గురువారం సాయంత్ర జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటకలోని తుమకూరుకు చెందిన అశోక్ అనే వ్యక్తి గాయపడ్డాడు. ఈయన పావగడ వైపు నుంచి మడకశిర వైపు బైక్‌లో వస్తూ స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పి కింద పడ్డాడు. తీవ్ర గాయాలైన ఆయన్ను మడకశిర ఆస్పత్రికి తరలించారు.

శనేశ్వరస్వామికి మండల పూజ

అమరాపురం: మండలంలోని బసవపల్లి గ్రామంలో శనేశ్వరస్వామికి గురువారం మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ఆలయ ఆవరణలో శాంతి, వాస్తు, గణ తదితర హోమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వారికి తైలాభిషేకం, పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు.

వానరాల హఠాన్మరణం

మడకశిర రూరల్: పట్టణంలోని గాంధీ బజారు వీధిలో వానరాలు హఠాన్మరణం చెందుతున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు. మూడు రోజులుగా రోజు మూడు, నాలుగు వానరాలు అస్వస్థతకు గురై మృతి చెందుతున్నాయని, గురువారం కూడా ఒక వానరం మృతి చెందినట్లు తెలిపారు. ఎండలకు తాళలేక మృతి చెందుతున్నట్లు కొందరు చెబుతుండగా.. అంతుచిక్కని వ్యాధితో మృతి చెందుతున్నాయని మరికొందరు అంటున్నారు.

అధ్యక్షుడికి సన్మానం

లేపాక్షి: జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన శివకుమార్‌ను చోళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

హిందూపురం: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా 6వ వార్డు ధర్మపురంలో మాజీ కౌన్సిలర్ రహెమాన్ గురువారం పేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, బేడలు ఇతరవస్తువులతో కూడిన కిట్లు అందించారు.

నా కుమారుడికి మద్దతివ్వండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణప్ప

పావగడ: పావగడనుంచి కాంగ్రెస్ తరఫున ఎన్నికల బరిలో ఉన్న తన కుమారుడు హెచ్‌వీ వెంకటేశ్‌కు వాల్మీకులు మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే వెంకటరమణప్ప కోరారు. సాయిరాం మందిరంలో గురువారం వాల్మీకుల సముదాయంతో సమావేశమై మాట్లాడారు. వాల్మీకి భవనం, సముదాయ భవనాలు, ఎస్టీ హాస్టల్ భవనాలు నిర్మించానన్నారు. ఎన్నికల్లో తనకుమారుడిని గెలిపించాలని కోరారు. అభ్యర్థి వెంకటేశ్, వాల్మీకి నాయకులు చిత్తగానహళ్లి చంద్రు, సుమన్, దివాకర్, జగన్నాథ్, ఓంకార నాయక్, భరత్ పాళేగార్ పాల్గొన్నారు.

రబీ ఈ–క్రాప్ బుకింగ్‌పై గ్రామసభ

మడకశిర: రబీ ఈ–క్రాప్ బుకింగ్‌పై మడకశిరలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రంలో గురువారం గ్రామసభనిర్వహించారు. ఆర్బీకే ఇన్‌చార్జ్ రాజేష్ మాట్లాడుతూ రబీలో పంటలు సాగు చేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ పథకంలో లబ్ధి పొందడానికి అర్హులైన కొత్త రైతులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

అమరాపురం: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేష్ పేర్కొన్నారు. అనిమీయా ముక్త భారత్‌పై మండలంలోని వలస గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం ఆయన అవగాహన కల్పించారు. వైఎస్సార్ జగనన్న గోరుముద్ద కార్యక్రమం కింద అందిస్తున్న పోషక విలువలతో కూడిన మధ్యాహ్న భోజనంతోపాటు రాగి జావ ద్వారా రక్తంలో హిమోగ్లోబిన్ శాతం పెరిగి తద్వారా రక్తహీనత దూరమవుతుందన్నారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు.

హౌసింగ్ బిల్లులు మంజూరు

రొద్దం: మండలంలోని తురకలాపట్నం వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లో పునాదులవరకు నిర్మాణం చేపట్టిన 41 మంది లబ్ధిదారులకు బిల్లులు మంజూరైనట్లు హౌసింగ్ డీఈ నాగరాజు చెప్పారు. మండలంలో జగుతున్న ఇళ్ల నిర్మాణంపై గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమీక్షా సమావేశం నిర్వహించారు. లబ్ధిదారుల వివరాలను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సక్రమంగా అప్‌లోడ్ చేసేలా చూడాలని హౌసింగ్ ఏఈ ఖాజామైనుద్దీన్‌కు సూచించారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగస్వామినాయక్ పాల్గొన్నారు.

ముందస్తు అడ్మిషన్లు అడ్డుకోండి

మడకశిర: ప్రైవేట్ విద్యా సంస్థల్లో ముందస్తు అడ్మిషన్లను నివారించాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం తహసీల్దార్ బాలాంజనేయులుకు వినతిపత్రం అందజేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఈరేష్ మాట్లాడుతూ టెన్త్ పరీక్షలు జరుగుతుండగానే కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్లపై కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు. సదరు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

పరిగి: పరిగి పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ సురేష్ కుమార్ గురువారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. గర్భిణుల ఎత్తు, బరువు, రక్తంలో హిమోగ్లోబిన్ శాతం, మధుమేహం, కడుపులో బిడ్డ స్థితి తదితర పరీక్షలను చేపట్టి మందులను పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ వన్నప్ప పాల్గొన్నారు.

ముస్లింలకు ఎమ్మెల్యే ఇఫ్తార్ విందు



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

పెనుకొండ: రంజాన్ ఉపవాసాలను పురస్కరించుకుని ముస్లిం ప్రజలకు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఇఫ్తార్ విందు ఇచ్చారు. పట్టణంలోని దర్గా రోడ్డులో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విందుకు ముస్లిం ప్రజలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపవాస దీక్షల్లో ఉన్న ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం తన అదృష్టమన్నారు. ప్రతి ముస్లిం కుటుంబం చల్లగా ఉండాలని అల్లాను ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్య నాయకుడు జయశంకర రెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్, వైస్ చైర్మన్లు బోయసునీల్, నందిని, వైఎసార్ సీపీ టౌన్ కన్వీనర్ బోయనరసింహ, ఎంపీపీ గీత, రామ్మోహన్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, వెంకటరామిరెడ్డి, ముహీబా, కౌన్సిలర్లు రఘునాథరెడ్డి, తయూబ్, సద్దాం, రామాంజినేయులు, గణేష్, ఫరీద్, యాసిన్, బోయబాబు, శంకరరెడ్డి, కిరణ్, నాయుడు, రాము మారుతి, శ్రీరాములు, కృష్ణప్ప, మునీర్, చండానాయక్, పూలమూర్తి పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌కు సహకరించండి



మాట్లాడుతున్న ఏడీజె శైలజ

హిందూపురం: మెగా లోక్‌ఆదాలత్ ద్వారా ఎక్కువసంఖ్యలో కేసుల పరిష్కారానికి సహకరించాలని హిందూపురం అదనపు జిల్లా జడ్జి శైలజ కోరారు. మెగా లోక్ ఆదాలత్ నిర్వహణపై పోలీసులు, వివిధ శాఖల అధికారులతో గురువారం కోర్టు ఆవరణలో న్యాయమూర్తి సమీక్ష నిర్వహించారు. హైకోర్టు ఆదేశాలతో మే 13న జరిగే మెగా లోక్ అదాలత్‌కు అన్ని శాఖల అధికారులు సహకరించాలన్నారు. ముఖ్యంగా చెక్ బౌన్స్, వైవాహిక సంబంధ సమస్యలు రాజీమార్గంలో పరిష్కరించుకోవచ్చన్నారు. రాజీకి అవకాశం ఉన్న క్రిమినల్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చని జడ్జి తెలిపారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్, ప్రత్యేక మెజిస్ట్రేట్ ఆనందతీర్థ, కీర్తనతోపాటు ఏపీపీలు ఇందాద్, ఏజీపీ శ్రీనివాస్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగరాజు, నగేష్ పాల్గొన్నారు.

విచారణ చేసి న్యాయం చేయండి

హిందూపురం టౌన్: తమ కుమార్తె పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేసినందుకు బెదిరింపులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని అనంతపురానికి చెందిన నళిని అనే మహిళ విజ్ఞప్తి చేసింది. గురువారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకరులతో మాట్లాడారు. టేకులోడు బాలికల గురుకుల పాఠశాలలో తన కుమార్తెల్లో ఒకరు 8వ తరగతి, మరొకరు 7వ తరగతి చదువుతున్నారన్నారు. 8వ తరగతి చదువుతున్న అమ్మాయితో నైట్ వాచ్‌మెన్ నరసింహమూర్తి అసభ్యంగా ప్రవర్తించాడని, ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. ఎవరికైనా చెబితే టీసీ ఇచ్చి పంపేస్తామని ప్రిన్సిపాల్ బెదిరించిందన్నారు. అదే పాఠశాలకు చెందిన మాజీ ప్రిన్సిపాల్, మరికొంత మంది తనకు ఫోన్ కాల్స్ చేస్తూ బెదిరిస్తున్నారన్నారు. చిలమత్తూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నరసింహమూర్తిని అరెస్ట్ చేశారన్నారు. అయితే ప్రిన్సిపాల్, మాజీ ప్రిన్సిపాల్‌ను అరెస్ట్ చేయకుండా కేసును నీరుగారుస్తున్నారన్నారు.